సాక్షి
ఒడిశా

శనివారం । 20 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలక వర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,71,038, బంగారం 240 మిల్లీ గ్రాములు, వెండి 2 గ్రాముల 700 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ఉత్సవ శోభ

రాష్ట్రవ్యాప్తంగా సావిత్రి అమావాస్య పూజలు ఘనంగా జరిగాయి.

- 10లో



పిడుగుపాటుకు గొర్రెలు మృతి

కాశీనగర్ బ్లాక్ ఖండవలో పిడుగుపాటుకు 12 గొర్రెలు, మేకలు మృత్యువాతపడ్డాయి.

- 10లో

న్యూస్‌రీల్

నెలరోజుల్లో తాగునీటి సమస్య పరిష్కారం



సమస్యలు తెలుసుకుంటున్న బీడీఓ ఖొర

రాయగడ: నెల రోజుల్లో గొట్టపు బావులు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామని బీడీఓ సునీల్ ఖొర గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కల్యాణ సింగుపూర్ సమితి సెరిగుమ్మ పంచాయతీ కొలాంగ్‌లో శుక్రవారం బీడీఓ పర్యటించారు. ఇక్కడ కొండల నడుమ 27 కుటుంబాలు నివాసముంటున్నాయి. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని, వాగుల నుంచి వచ్చే నీటిపైనే ఆధారపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో పీడీఎస్ బియ్యం తీసుకువచ్చేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. అనంతరం బీడీఓ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సమితి ఇంజినీర్ సవ్యసాచి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి అభివృద్ధికి రూ.1.06 కోట్లు మంజూరు



ఎంపీ రమేష్ చంద్ర మాఝి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా అభివృద్ధికి నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మాఝి రూ.కోటీ ఆరు లక్షల నిధులు మంజూరు చేసినట్లు బీజేడీ సభ్యులు శుక్రవారం తెలిపారు. జిల్లాలోని ఏడు సమితుల్లో ఇటీవల ఎంపీ పర్యటించి సమస్యలు తెలుసుకున్నారని, ఈ నేపథ్యంలో నిధులు మంజూరు చేశారని చెప్పారు. మల్కన్‌గిరి పురపాలక వార్డులో 13 ప్రాజెక్టులకు రూ.27లక్షలు, మల్కన్‌గిరి సమితిలో రూ.10 ప్రాజెక్టులకు రూ.20 లక్షలు, పోడియా సమితిలో తొమ్మిది పంచాయతీలకు రూ.20 లక్షలు, కలిమెల సమితిలో 5 పంచాయతీలకు రూ.10 లక్షలు, కోరుకొండ సమితిలో రెండు ప్రాజెక్టులకు రూ.8 లక్షలు, మత్తిలి సమితిలో ఐదు ప్రాజెక్టులకు రూ.15 లక్షలు, బలిమెల ఎన్‌ఏసీలో రెండు ప్రాజెక్టులకు రూ.6 లక్షలు చొప్పున మంజూరు చేసినట్లు వివరించారు.

ప్రజలకు ఉచిత న్యాయ సేవలు



మాట్లాడుతున్న న్యాయ సేవాధికారి

జయపురం: న్యాయ సేవా ప్రదీకరణ ద్వారా ప్రజలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తున్నామని కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ జడ్జి సుమన్ జెనా తెలిపారు. గురువారం మౌళి పంచాయతీ బాపనిగుడలో సచేతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, పౌరుల హక్కులు, లోక్ అదాలత్ ప్రయోజనాలను వివరించారు. ఎటువంటి ఖర్చు లేకుండా న్యాయ సహాయం పొందవచ్చన్నారు. అనంతరం స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్ రాజేశ్వర మహురియ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం ఎప్పుడిస్తారు?



సీడీపీఓ కార్యాలయం ఎదుట బైఠాయించిన డొంగిరియా మహిళలు

రాయగడ: బిసంకటక్ సమితి నియమగిరి పర్వత ప్రాంతంలోని కుర్లి పంచాయతీ గొర్తిలి గ్రామంలో డొంగిరియా మహిళలు శుక్రవారం సీడీపీఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా తమకు ఎటువంటి పౌష్టికాహారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాతా, శిశువుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం పంపిణీలో అంగన్‌వాడీ కార్యకర్త నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. నెల రోజులుగా గుడ్లు, ఇతర సరుకులు ఇవ్వడం లేదని సీడీపీఓ సుశీల సాబొరొ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆమె స్పందిస్తూ పరిశీలించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు నిరసన విరమించారు.

జల వివాదాలకు తెరపడేనా?



హీరాకుడ్ జలాశయం

- రాష్ట్రంలో మహానది ట్రిబ్యునల్ పర్యటన ప్రారంభం
- పది రోజుల పాటు క్షేత్రస్థాయి సర్వే
- తొలి రోజు హీరాకుడ్ సందర్శన

భువనేశ్వర్: మహానది జలాల పంపిణీ వివాద ట్రిబ్యునల్ రాష్ట్ర పర్యటనకు విచ్చేసింది. 10 రోజుల పాటు ఈ బృందం రాష్ట్రంలో పర్యటిస్తుంది. మహానది జలాల పంపిణీ వివాదానికి సంబంధించి రాష్ట్రంలో పలు చోట్ల క్షేత్ర స్థాయి సర్వే నిర్వహిస్తుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.ఎం.ఖాన్విల్కర్ ఆధ్వర్యంలో పాట్నా హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ రవి రంజన్, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఇందర్మీత్ కౌర్ కొచార్‌లతో మహానది ట్రిబ్యునల్ సభ్యుల బృందం తొలి రోజు శుక్రవారం హీరాకుడ్ ప్రాంతంలో సందర్శించింది.

ఈ నెల 23 వరకు మహానది పరివాహక ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సర్వే చేపడుతుంది. 24న బృందం భువనేశ్వర్ చేరుతుంది. ఒక రోజు విరామం తర్వాత 25న నరాజ్, ముండలి, సతుప ప్రాంతాలు సందర్శిస్తుంది. 26 నుంచి 28 వరకు కటక్, చిలికా సరస్సు ప్రాంతాలు సందర్శిస్తుంది. ఇలా 30 మహా నది పరివాహక ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి సర్వే కొనసాగుతుంది. ఈ ప్రాంతాల్లో చిపిలిమా పవర్ స్టేషన్, ఈబ్ వ్యాలీ, టికరపడా ఆనకట్ట, చిలికా సరస్సు, బిరూపా, మహానది నదులపై బ్యారేజీలను సందర్శిస్తుంది. మహానది డెల్టాలో భాగమైన దయా, భార్గవి, కుశభద్ర నదుల్లో నీటి ప్రవాహాన్ని సైతం బృందం అంచనా వేస్తుంది. కటక్‌లోని నరాజ్ బ్యారేజీ స్థలాన్ని కూడా సందర్శించనుంది. ఈ బృందం ఈ ఏడాది ఏప్రిల్ 17న ఛత్తీస్‌గఢ్, మహానది బేసిన్‌లో ఐదు రోజుల పాటు తొలి దశ క్షేత్ర స్థాయి సర్వే నిర్వహించింది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా మధ్య మహానది నదీ జలాల భాగస్వామ్యంపై దీర్ఘకాలంగా ఉన్న వివాదాలను పరిష్కరించేందుకు ట్రిబ్యునల్ బృందం క్షేత్ర స్థాయిలో స్థితిగతుల్ని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుంది. ఛత్తీస్‌గఢ్‌లోని కమ్లాతో సహా పారిశ్రామిక బ్యారేజీలు వర్షాకాలం కాని కాలంలో ఒడిశా వైపు మహా నది నదిలో నీటి ప్రవాహం గణనీయంగా తగ్గడానికి కారణమని ఒడిశా అధికారుల అభిప్రాయం. ఛత్తీస్‌గఢ్ నిర్మించిన డ్యామ్‌లలో నీటి నిల్వ కూడా మహానది లోతట్టు ఒడిశాకు నీటి ప్రవాహాన్ని ప్రభావితం చేసిందని రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తోంది. ఈ వివాదాలు పరిష్కరించేందుకు ట్రిబ్యునల్ బృందం వివాదస్పద అంశాల్ని క్షేత్ర స్థాయిలో సమీక్షించి ఉమ్మడి సమాచార నివేదికని ట్రిబ్యునల్‌కు సమర్పిస్తుంది.

వారంలోగా మహానది నీటిని విడుదల చేయాలి: కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న శరత్ పట్నాయక్, బిజయకుమార్ పట్నాయక్

భువనేశ్వర్: ఒడిశాలో మహా నదీ జలాల వివాదాల ట్రిబ్యునల్ క్షేత్ర పర్యటనను ప్రారంభించిన నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ స్పందించింది. స్థానిక కాంగ్రెసు భవన్‌లో శుక్రవారం ఒడిశా ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్‌తో కలిసి ప్రచార కమిటీ చైర్మన్ బిజయ కుమార్ పట్నాయక్ మాట్లాడారు. దీర్ఘ కాలంగా వేధిస్తున్న మహా నదీ జలాల పంపిణీ వివాద పరిష్కారంలో రాష్ట్రంలోని బిజూ జనతాదళ్ (బీజేడీ) ప్రభుత్వ పనితీరుపై మండిపడ్డారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. మహా నదీ జలాల వివాదాల పరిష్కారానికి 2018లో ట్రిబ్యునల్ ఏర్పాటైందని, ఈ ఐదేళ్లలో ట్రిబ్యునల్ బిజయ్ పట్నాయక్ ఒక్క ఉత్తర్వు కూడా జారీ చేయలేదని అన్నారు. ట్రిబ్యునల్ పని ఊపందుకోవడానికి అవసరమైన సాధారణ (ఉమ్మడి) సమాచార నివేదిక ఇంత వరకు సిద్ధం కాకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఛత్తీస్‌గఢ్ బ్యారేజీల నిర్మాణం తర్వాత మేలో హిరాకుడ్ జలాశయానికి నీటి ప్రవాహం అడుగంటిందని, సగటున 77.7 శాతం నీటి ప్రవాహం తగ్గుదల ఉందని పేర్కొన్నారు. నిర్దిష్ట గడువు లోగా ట్రిబ్యునల్ తీర్పు జారీ చేయాలని బిజయ కుమార్ పట్నాయక్ కోరారు. నీటి సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని, ట్రిబ్యునల్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి ఉండాల్సిందని అభిప్రాయ పడ్డారు. మహా నది ఎగువ ప్రాంతంలో నిల్వ నీటిని లోతట్టు ఒడిశాలోని మహా నది పరివాహక కాలువల ద్వారా వారం రోజుల్లో విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రయాణికుల బస్సుపై.. పేలిన తూటా

- తప్పిన పెను ప్రమాదం
- గుర్తు తెలియని వ్యక్తుల దుశ్చర్య
- బొయపరిగుడ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఘటన
- రంగంలోకి దిగిన పోలీసులు



బొయిపరిగుడ పోలీసుస్టేషన్



తూటాల ధాటికి పగిలిన బస్సు అద్దం

జయపురం: ప్రయాణికుల బస్సుపై తూటాల వర్షం కురిసింది. మావో ప్రభావిత ప్రాంతమైన బొయిరపిగుడ పోలీస్‌స్టేషన్‌కు అతి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ఈ దుశ్చర్యకు పాల్పడటంతో ప్రయాణికులు భీతిల్లిపోయారు. ఈ ఘటనకు పాల్పడిన వారి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గురువారం సాయంత్రం మల్కనగిరి జిల్లా బలిమెల నుంచి మల్కనగిరి, జయపురం మీదుగా బరంపురం పట్టణానికి ఒడిశా రోడ్డు ట్రాన్స్‌పోర్టు బస్సు ప్రయాణికులతో బయలుదేరింది. రాత్రి 10 గంటల సమయంలో బొయిపరిగుడ పోలీసుస్టేషన్‌కు 200 మీటర్ల దూరంలో బస్సు వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఒక్కసారిగా బస్సుపై తుపాకీ కాల్పులు జరిపారు. తూటాల ధాటికి బస్సు కిటికీ అద్దాలు పగిలిపోయాయి. వెంటనే డ్రైవర్ బస్సు నిలిపివేశారు. అనంతరం బొయిపరిగుడ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కండక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాల్పులు జరిగిన సమయంలో బస్సులో 10 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరందరినీ పోలీసులు ప్రశ్నిస్తున్నారు. విషయం తెలుసుకున్న జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి హరిష్ స్టేషన్‌కు చేరుకుని విచారణ చేపట్టారు. సిబ్బంది, ప్రయాణికులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే పట్టుకోవాలని పోలీసులను ఆదేశించారు. బస్సుపైకి తూటాలు ఎవరు, ఎందుకు పేల్చారు అన్న విషయమై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

తలకు మించిన భారం!

- వింత వ్యాధితో బాలుడి అవస్థలు
- దాతలే ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు



కుమారుడితో తల్లిదండ్రులు

జయపురం: అసలే పేదరికం. ఆపై అనారోగ్యం. కళ్ల ముందే బిడ్డ పడుతున్న బాధను చూడలేక ఆ దంపతులు నరకయాతన అనుభవిస్తున్నారు. దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. జయపురం సబ్ డివిజన్ కొట్‌పాడ్ సమితి బెంటగుడ గ్రామానికి చెందిన బలరాం జాని, రుక్మిణీ జానిల ఏడాది కుమారుడు అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్నారు. పుట్టినప్పుడు శారీరక పరిస్థితి కొంత బాగానే ఉన్నా రెండు నెలల తర్వాత క్రమంగా తల పెరుగుతూ వస్తోంది. పలు ఆస్పత్రులకు తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. నిద్ర సరిగ్గా లేకపోవడంతో ఎప్పుడూ ఏడుస్తూ ఉంటాడని తల్లిదండ్రులు వాపోతున్నారు. కొట్‌పాడ్ కమ్యూనిటీ హాస్పిటల్, కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రి, ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లోని ప్రముఖ ఆస్పత్రులకు తీసుకెళ్లినా నయం కాలేదని చెబుతున్నారు. కటక్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా శస్త్రచికిత్సకు చాలా డబ్బులు అవసరమవుతాయని చెప్పారని, కూలి పనులు చేసుకుంటున్న తాము అంత సొమ్ము చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అనేక ఆస్పత్రులకు వెళ్లడంతో డబ్బులన్నీ ఖర్చయిపోయాయని చెబుతున్నారు. ఇప్పుడు శస్త్రచికిత్సకు డబ్బులు లేక నిస్సహాయంగా మిగిలామని వాపోతున్నారు. దాతలు ముందుకు వచ్చి తమ కుమారుడికి ప్రాణభిక్ష పెట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మీడియా ముసుగులో గంజాయి రవాణా



పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు

కొరాపుట్: ప్రెస్‌పేరుతో గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ఇద్దరిని కొరాపుట్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నందపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాడువా సమీపంలో గంజాయి స్మగ్లింగ్ జరుగుతోందన్న సమాచారం మేరకు పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రెస్ పేరుతో బొడదేవత జంక్షన్ వద్ద ఎంహెచ్ 20 సీఎస్ 4800 నంబర్ కారు రాగా పోలీసులు ఆపారు.మహారాష్ట్ర మీడియా వాహనం ఇక్కడికి ఎందుకు వచ్చిందనే అనుమానంతో తనిఖీ చేయగా అందులో ఏడు బస్తాల్లో 151 కేజీల గంజాయి పట్టుబడింది. వాహనంలో ఉన్న స్మగ్లర్లు మహారాష్ట్రకు చెందిన శుభం, సంజయ్ సింగ్‌లను అరెస్ట్ చేసినట్లు నందపూర్ ఎస్‌డీపీఓ సంజయ్ మహాపాత్రో ప్రకటించారు.

పొట్టకూటికి వెళ్లి.. పరలోకాలకు..

- తిరుపూర్‌లో గజపతి జిల్లా వాసి మృతి
- మృతదేహం తరలింపునకు సాయం చేయాలని కుటుంబ సభ్యుల వినతి



మృతిచెందిన రాహుల్ లిమ్మా (ఫైల్)



కార్మిక అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న కుటుంబ సభ్యులు

పర్లాకిమిడి: ఉపాధి కోసం తమిళనాడు రాష్ట్రం వెళ్లి గజపతి జిల్లా యువకుడు మృత్యుఒడికి చేరాడు. గారబంద పోలీసుస్టేషన్ పరిధిలోని రాయగడ సమితి గండాహాతి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ లిమ్మా కుమారుడు రాహుల్ లిమ్మా (19) మూడు నెలల కిందట తమిళనాడు రాష్ట్రం తిరుపూర్‌కు వెళ్లి ఓ ప్రైవేటు గార్మెంట్స్ ఫ్యాక్టరీలో పనిలో చేరాడు. ఏం జరిగిందో గానీ గురువారం రాత్రి రెండు గంటలకు రాహుల్ చనిపోయినట్టు తండ్రికి ఫోన్‌లో సమాచారం అందింది. అయితే తిరుపూర్ నుంచి కుమారుడి మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు డబ్బులు లేకపోవడంతో గజపతి జిల్లా కార్మిక అధికారిని కలిసేందుకు పర్లాకిమిడి వెళ్లాడు. అక్కడ అధికారి లేకపోవడంతో అసిస్టెంట్ కార్మిక అధికారికి వినతి పత్రం అందజేశారు. ఎలాగైనా తన కుమారుడి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించడానికి సాయం చేయాలని విన్నవించారు.

వైభవం.. నీలమ్మ సంబరం



ముర్రాటలు తీసుకెళ్తున్న మహిళలు



నీలమ్మగుడి వద్ద భక్తజన సందోహం

స్థానిక రాంనగర్ ఒకటో వార్డులో గ్రామదేవత నీలమ్మ సంబరాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదేళ్లకోసారి జరిగే ఈ ఉత్సవాలలో భాగంగా మహిళలంతా ముర్రాటలతో వెళ్లి కాలేజ్ రోడ్డులో వున్న గ్రామదేవతకు చల్లదనం చేశారు. అనంతరం అమ్మవారిని బుట్టలో ఉంచి ఊరేగింపుగా రాంనగర్ తీసుకువచ్చారు. ఉత్సవాల సందర్భంగా వీధులన్నీ విద్యుద్దీపాలతో అలంకరించారు. హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి ఉత్సవాల్లో పాల్గొన్నారు.

– పర్లాకిమిడి

మృత్యువులోనూ వీడని బంధం

- చెరువులో మునిగి అక్కాతమ్ముళ్ల మృతి
- పిప్పల్‌పుట్‌లో విషాద ఛాయలు



జోగేష్ బొడనాయక్ (ఫైల్)



సంతోషి బొడనాయక్ (ఫైల్)

కొరాపుట్: తండ్రితో సరదాగా వ్యవసాయ పొలానికి వెళ్లిన అక్కాతమ్ముళ్లు చెరువులో మునిగి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. దీంతో కుటుంబ సభ్యుల, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ విషాదకర ఘటన శుక్రవారం కొరాపుట్ జిల్లా లమ్తాపుట్ సమితి మాచ్‌ఖండ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిప్పల్‌పుట్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జమ్మి బోడనాయక్ తన కుమార్తె సంతోషి బొడనాయక్ (7), కుమారుడు జోగేష్ బొడనాయక్ (5)తో కలిసి పొలానికి వెళ్లాడు. తండ్రి వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండగా అక్కా తమ్ముళ్లు సమీపంలో చెరువులో దిగారు. దీనిని తండ్రి గమనించలేదు. కొంత సేపటి తర్వాత పిల్లల కోసం వెతకగా ఆచూకీ తెలియలేదు. వెంటనే గ్రామంలోకి వెళ్లి ఆరా తీసినా ఫలితం లేక పోయింది. అనుమానం వచ్చి తాను పనిచేసిన పొలం సమీపంలోని చెరువులో గాలించగా చిన్నారుల మృతదేహాలు బయటపడ్డాయి. అంతవరకు తనతోనే ఉన్న బిడ్డలు మృత్యుఒడికి చేరడంతో తండ్రి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.



విషాదంలో కుటుంబసభ్యులు, గ్రామస్తులు

క్లుప్తంగా

చెట్టును ఢీకొన్న కారు



నుజ్జయిన కారు

రాయగడ: రాయగడ నుంచి తెరువలి వైపు వెళుతున్న కారు అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి చెట్టును ఢీకొన్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కారు డ్రైవరు వివరాలు తెలియాల్సి ఉంది.

నువాపుట్ చేరిన సీతారామలక్ష్మణుల విగ్రహాలు



సీతారామలక్ష్మణ విగ్రహాలు

జయపురం: ఈ నెల 29న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా జయపురం సమితి బలియ పంచాయితీ నువాపుట్ గ్రామానికి సీతారామ, లక్ష్మణ స్వాముల విగ్రహాలు గురువారం చేరాయి. బొరియగుడ నుంచి మంగళ వాయిద్యాల నడుమ విగ్రహాలను తీసుకువచ్చినట్లు గ్రామ మందిర కమిటీ అధ్యక్షుడు రామేశ్వరనాయక్, కార్యదర్శి హరిహర నాయిక్, కోశాధికారి త్రినాథ్ పూజారి తెలిపారు. ఈ నెల 22న కలశ యాత్ర, మహాస్నాన, ప్రాణ ప్రతిష్ఠ, 24న సీతారామ, లక్ష్మణుల సింహాసన ఆరోహణ, 29న పాత శ్రీరామ మందిరంలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

ఎయిమ్స్ కొత్త అధ్యక్షుడిగా బిసోయ్



డాక్టర్ ఎ.కె.బిసోయ్

భువనేశ్వర్: ప్రముఖ కార్డియాక్ సర్జన్ డాక్టర్ అక్షయకుమార్ బిసోయ్ భువనేశ్వర్ అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) కొత్త అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య – కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ సుబ్రత్ ఆచార్య స్థానంలో ఈయన నియమితులయ్యారు. న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో కార్డియాక్ సర్జరీ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ బిసోయ్ మూడు దశాబ్దాల వృత్తిపరమైన నైపుణ్యత, ఆవిష్కరణలతో నిష్ణాతుడైన సర్జన్‌గా పేరొందారు. ఆరోగ్య సంరక్షణలో ప్రభావవంతమైన, స్థిరమైన 32,000 విధానాలను ప్రదర్శించారు. వీటి కార్యాచరణను సైతం రూపొందించారు. వైద్య బోధన రంగంలో ప్రతిష్ఠాత్మకమైన డాక్టర్ బి.సి.రాయ్ మెమోరియల్ అవార్డును సొంతం చేసుకున్నారు.

పిడుగుపాటుకు గొర్రెలు, మేకలు మృత్యువాత



మృతిచెందిన మేకల వద్ద బాధితులు

పర్లాకిమిడి: కాశీనగర్ బ్లాక్ ఖండవ గ్రామంలో గురువారం రాత్రి సంభవించిన పిడుగుపాటుకు ఐదు మేకలు, ఏడు గొర్రెలు మృతి చెందినట్టు యాదవకుల సంఘం అధ్యక్షుడు ఎ.కులవర్ధనరావు తెలిపారు. వడ్డి అప్పారావుకు చెందిన ఐదు మేకలు, అంకబోయిన కృష్ణకు చెందిన ఏడు గొర్రెలు మేతకు వెళ్లి తిరిగి వస్తుండగా పిడుగుపాటుకు గురై మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని కాశీనగర్ వెటర్నరీ అధికారుల దృష్టికి బాధితులు తీసుకెళ్లారు. నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావుకు వినతిపత్రం అందజేశారు.

కుమార్తే కొడుకుగా మారి..



తండ్రి అంత్యక్రియల్లో కుమార్తె

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని బైరి గ్రామానికి చెందిన బైరి ఈశ్వరమ్మ తన తండ్రి మడ్డు బాలయ్యకు శుక్రవారం తలకొరివి పెట్టింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మడ్డు బాలయ్య (95) అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఈయనకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆస్తి తగాదాల కారణంగా కుమారుడు పాతికేళ్లుగా తండ్రికి దూరంగానే ఉన్నారు. అప్పటి నుంచి బాలయ్య తన కుమార్తె ఈశ్వరమ్మతోపాటే ఉంటున్నారు. అయితే కొడుకు చివరి చూపునకు కూడా రాకపోవడంతో కూతురే తలకొరివి పెట్టింది.



రాయగడ: పూజలు చేస్తున్న మహిళలు



కొరాపుట్: సామూహిక పూజలు నిర్వహిస్తున్న మహిళలు



కొరాపుట్: సునాబెడాలో సావిత్రి అమావాస్య పూజలు

ఉత్కళ లోగిళ్లలో.. ఉత్సవ శోభ

- భక్తిశ్రద్ధలతో సావిత్రి అమావాస్య పూజలు
- కిటకిటలాడిన దేవాలయాలు

రాయగడ/మల్కన్‌గిరి/కొరాపుట్/పర్లాకిమిడి: ఉత్కళవాసులు పవిత్రంగా భావించే సావిత్రి అమావాస్య పూజలు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. భర్త క్షేమాన్ని కాంక్షిస్తూ ప్రతి మహిళ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రాయగడలోని జగన్నాథ మందిరం ప్రాంగణంలో లక్ష్మీదేవి అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన వస్త్రా లు ధరించి ఉపవాసం ఆచరించి పూజలు అనంత రం దీక్ష విరమించారు. పసుపుతో రూపొందించిన అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించా రు. కొందరు ఇళ్లలోనే పూజలు జరుపుకొన్నారు.

మల్కన్‌గిరిలో..

ఒడిశా మహిళలు శుక్రవారం సావిత్రీ అమావాస్య పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సౌభాగ్యం కల్పించాలంటూ అమ్మవారిని వేడుకున్నారు.

కొరాపుట్‌లో..

కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో సావిత్రి అమావాస్య పూజలు ఘనంగా జరిగాయి. వీటిన్నింటి పండ్లు ఈ పూజలో ఉంచాలనే నియమం వల్ల మార్కెట్లలో ధరలు కొండెక్కాయి. ప్రభుత్వం అధికారికంగా సెలవు ప్రకటించడంతో అంతటా పండగ వాతావరణం నెలకొంది. దేవాలయాలు కిటకిటలాడాయి.

పర్లాకిమిడిలో..

సావిత్రీ అమావాస్య సందర్భంగా పట్టణవాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్నవారు పంపిన కొత్త వస్త్రాలు, పండ్లతో సావిత్రి నోము నోచుకున్నారు. ముత్తయిదువులను పిలిచి రవిక, పండ్లు, కొబ్బరికాయలు వాయనంగా అందజేశారు. ఇలా చేయడం వల్ల పసుపుకుంకుమలు పది కాలల పాటు నిలబడతాయని మహిళల నమ్మకం.



రాయగడ: పసుపుతో రూపొందించిన విగ్రహం



మల్కన్‌గిరి: మందిరంలో పూజలు చేస్తున్న మహిళలు



రాయగడ: ఇళ్లలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



మల్కన్‌గిరి: కెనాల్ వీధిలో పూజ చేస్తున్న మహిళలు



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో వ్రతాలు చేస్తున్న మహిళలు



పర్లాకిమిడి: సావిత్రీ అమావాస్య పూజ చేస్తున్న మహిళ

ఏఎస్‌ఓ మెరిట్ జాబితా రద్దు

- రెండు నెలల్లో కొత్త జాబితాకు హైకోర్టు ఆదేశం

భువనేశ్వర్: ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఓపీఎస్‌సీ) ఆధ్వర్యంలో జరిగిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల (ఏఎస్‌ఓ) నియామక పరీక్ష ఫలితాల మెరిట్ జాబితాను ఒడిశా హైకోర్టు శుక్రవారం రద్దు చేసింది. ఇటీవల విడుదలైన ఈ జాబితాలో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయనే ఆరోపణతో రాష్ట్ర హైకోర్టులో కేసు దాఖలైన సంగతి తెలిసిందే. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు ఘాటుగా స్పందించింది. మెరిట్ జాబితా రద్దు చేసి కొత్త జాబితా రెండు విడుదల చేయాలని ఆదేశిస్తూ తుది తీర్పు వెలువరించింది.

ఇదీ సంగతి..

2022 ఆగస్టు 27న ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ 796 అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల పోస్టుల భర్తీకి రాత పరీక్ష నిర్వహించింది. అదే ఏడాది నవంబర్ 7న ఫలితాలు ప్రచురించింది. ఈ ప్రక్రియలో పలు అవకతవకలు జరిగాయంటూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాస్తవానికి రాత పరీక్షలో పలు అంశాల్లో అభ్యర్థులు సాధించిన సగటు మార్కులతో ఉత్తీర్ణత పరిగణనలోకి తీసుకుని మెరిట్ జాబితా రూపొందించాల్సి ఉంది. 2018 – 19 లో నిర్వహించిన పరీక్షల్లో ఓపీఎస్‌సీ ఇదే నియమాన్ని అవలంబించింది. ఈసారి మాత్రం ఒక్కో సబ్జెక్టులో సాధించిన మార్కుల్ని పరిగణనలోకి తీసుకుని 1,104 మందితో మెరిట్ జాబితా ఖరారు చేయడం నియమ ఉల్లంఘనగా పలువురు కోర్టును ఆశ్రయించారు. పూర్వాపరాలు పరిశీలించిన హైకోర్టు జాబితాను రద్దు చేసింది.

మరో ఐదురోజులు వడగాలులు

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా వీస్తున్న వడగాలుల తీవ్రత మరో ఐదు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ విభాగం తెలిపింది. పలు జిల్లాల్లో అనేక చోట్ల పగటి పూట గరిష్ట ఉష్ణోగ్రతలో పెద్ద మార్పు ఉండదని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ప్రాంతీయ కార్యాలయం పేర్కొంది. శుక్రవారం బొలంగీర్‌లో అత్యధికంగా 43.7 డిగ్రీల సెల్సియస్, సోన్‌పూర్‌లో 43.0 డిగ్రీల సెల్సియస్, సంబల్‌పూర్‌లో 43.0 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోని మారుమూల జిల్లాల్లో (సుందర్‌గడ్, సంబల్‌పూర్, అంగుల్, బౌధ్) రాబోయే రెండు రోజుల్లో ఒకటి, రెండు చోట్ల పగటి పూట గరిష్ట ఉష్ణోగ్రత 42 డిగ్రీల సెల్సియస్, అంతకంటే ఎక్కువ నమోదయ్యే అవకాశం ఉంది. దీని ప్రభావం సోన్‌పూర్, బర్‌గడ్, బొలంగీర్, కలహండి, ఝర్సుగుడ, నువాపడా జిల్లాలపై ఉండే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. అదే సమయంలో, కోస్తా ఒడిశా, కంధమల్, మయూర్‌భంజ్, ఢెంకనాల్ జిల్లాల్లో కొన్ని చోట్ల, సుందర్‌గడ్, దేవ్‌గడ్ జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కార్యాలయం పసుపు హెచ్చరిక (ఎల్లో వార్నింగు) జారీ చేసింది. కెంజొహర్, అంగుల్, బౌధ్, కలహండి, నవరంగపూర్, రాయగడ, మల్కన్‌గిరి, కొరాపుట్, నువాపడా, ఒడిశాలోని మిగిలిన జిల్లాల్లో వాతావరణం పొడిగా ఉంటుందని వాతావరణ విభాగం సమాచారం. గంజాం, నయాగఢ్, ఖుర్దా, కటక్, ఢెంకనాల్, జాజ్‌పూర్, భద్రక్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రపడా జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. దీని ప్రభావంతో చెట్ల కొమ్మలు విరిగి పడడంతో తేలికపాటి, అసురక్షిత నిర్మాణాలకు ముప్పు పొంచి ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అత్యవసరమైతే తప్ప ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని పేర్కొంది.

నేటి వాతావరణం..

శనివారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో గంజాం, నయాగఢ్, ఖుర్దా, కటక్, ఢెంకనాల్ జాజ్‌పూర్, భద్రక్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల మెరుపులు, వడగళ్లు, ఈదురు గాలులతో కూడిన ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

22 నుంచి హైకోర్టుకు వేసవి సెలవులు

భువనేశ్వర్: రాష్ట్ర హైకోర్టుకు ఈ నెల 22 నుంచి జూన్ 20 వరకు వేసవి సెలవులు ప్రకటించారు. వేసవి సెలవుల్లో బెంచ్‌ల షెడ్యూల్‌ను (వెకేషన్ కోర్టు) హైకోర్టు శుక్రవారం వెలువరించింది. ఈ బెంచ్‌లు అత్యవసర కేసులను విచారించేందుకు ఏర్పాటు చేశారు. మేలో 23, 25, 30, జూన్‌లో 1, 6, 8, 12, 13 తేదీల్లో సెలవుల బెంచ్‌లు పని చేస్తాయి. జస్టిస్ కె.ఆర్.మహాపాత్రో, జస్టిస్ ఎం.ఎస్.సాహూలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం, జస్టిస్ వి.నరసింగ్, జస్టిస్ చిత్తరంజన్ దాస్‌లతో కూడిన సింగిల్ జడ్జి బెంచ్‌లు మే 23, 25 తేదీల్లో పని చేస్తాయి. జస్టిస్ కె.ఆర్.మహాపాత్రో, జస్టిస్ ఎం.ఎస్.సాహూతో కూడిన ద్విసభ్య ధర్మాసనం, జస్టిస్ వి.నరసింగ్, జస్టిస్ గౌరీశంకర్ శత్పతిలతో కూడిన సింగిల్ జడ్జి బెంచ్‌లు మే 30న అత్యవసర కేసులను విచారించనున్నాయి. జస్టిస్ ఎస్.కె. సాహూ, జస్టిస్ ఎం.ఎస్.రామ్‌లతో కూడి న ద్విసభ్య ధర్మాసనం, జస్టిస్ బి.పి.రౌత్రాయ్, జస్టిస్ గౌరీశంకర్ శత్పతితో కూడిన సింగిల్ జడ్జి బెంచ్‌లు జూన్ 1న ప్రత్యేక వ్యాజ్యాలను విచారిస్తాయి. జూన్ 6, 8 తేదీల్లో జస్టిస్ ఎస్.కె.సాహూ, జస్టిస్ ఎం.ఎస్. రామ్‌లతో కూడిన ద్విసభ్య వెకేషన్ బెంచ్, జస్టిస్ శశికాంత మిశ్రా, జస్టిస్ బి.పి.శత్పతితో కూడి న సింగిల్ జడ్జి బెంచ్‌లు వెకేషన్ కోర్టులుగా వ్యవహరిస్తాయి. జస్టిస్ శశికాంత మిశ్రా, జస్టిస్ ఎస్.కే. మిశ్రాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం, జస్టిస్ ఆదిత్య కుమార్ మహాపాత్రో, జస్టిస్ బి.పి.శత్పతితో కూడిన సింగిల్ జడ్జి బెంచ్‌లు జూన్ 12,13 తేదీల్లో పని చేస్తాయి.

స్కూల్ అసిస్టెంట్ టు పీజీటీ



సబ్జెక్టు	భర్తీ చేసే పోస్టులు	దరఖాస్తు చేసుకున్న ఎస్ఏలు
తెలుగు	6	32
ఇంగ్లీషు	6	29
మ్యాథ్స్	6	26
ఫిజిక్స్	6	19
కెమిస్ట్రీ	6	13
బోటనీ	6	15
జువాలజీ	6	13
మొత్తం	42	147

- సర్కారీ బడుల్లో హైస్కూల్ ప్లస్ పేరిట ఇంటర్మీడియెట్ కోర్సులు
- ఆరు హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఎస్ఏలను పీజీటీలుగా నియమించడానికి చర్యలు
- జిల్లాలో అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లతో 42 పీజీటీ పోస్టుల భర్తీ
- నేడు శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్టిఫికెట్ల పరిశీలన

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అధిక సంఖ్యలో విద్యార్థులు కలిగిన పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా మార్చుతూ.. ఆ పాఠశాలల్లో ఇంటర్మీడియెట్ కోర్సులను ఆ ఏడాది మొదలుపెట్టనున్నారు. ఈ పాఠశాలల్లో బోధన కోసం పీజీటీల(పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్) నియామకాలను పూర్తి చేయనున్నారు. ఇందుకోసం పీజీ విద్యార్హతతో పాటు సీనియారిటీ కలిగిన ఉపాధ్యాయులనే పీజీటీలుగా నియమించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలో 42 పోస్టులకుగాను ఔత్సాహిక ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను కూడా స్వీకరించింది. వివిధ సబ్జెక్టులకు కలిపి మొత్తం 147 మంది దరఖాస్తు చేసుకున్నారు.

జిల్లాలో ఆరు హైస్కూల్ ప్లస్ పాఠశాలలు..

జిల్లాలో ఉర్లాం, హరిపురం, రొట్టవలస, వజ్రపుకొత్తూరు, బ్రాహ్మణతర్ల, టెక్కలి (బాలికలు)జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్ బడులుగా మార్చారు. ఈ ఆరు హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో వివిధ సబ్జెక్టుల్లో పీజీటీ పోస్టులను భర్తీ చేయనున్నారు. మరోపక్క హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో పీజీటీ పోస్టులను అర్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులతో భర్తీ చేసి ఉద్యోగావకాశాలను కల్పించాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు శ్రీకాకుళంలో సర్టిఫికెట్ల పరిశీలన

హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో పీజీటీలుగా నియామకం పొందేందుకు తగు అర్హత, ఆసక్తి సీనియారిటీ కలిగిన ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈనెల 20న ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం వేదికగా సర్వీస్ రిజిస్టర్‌తోపాటు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. స్క్రూటినీ కోసం ప్రత్యేకంగా కమిటీలను నియమించారు.

పారదర్శకంగా భర్తీ చేస్తాం..

సీనియారిటీ జాబితా ప్రకారం పారదర్శకంగా పీజీటీ పోస్టులను భర్తీ చేస్తాం. హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో మరింత నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. దరఖాస్తు చేసుకుని ఉండి ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు తమ సర్వీస్ రిజిస్టర్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేడు శ్రీకాకుళం బాయ్స్ హైస్కూల్‌కు చేరుకోవాలి.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం

42 పీజీటీ పోస్టులు భర్తీ..

జిల్లాలో హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఏడు సబ్జెక్టుల్లో కలిపి మొత్తం 42 పీజీటీ పోస్టులను అర్హులైన, సీనియారిటీ కలిగిన స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయనున్నారు. వీటికి ఇప్పటికే దరఖాస్తులను ఆహ్వానించగా 147 మంది ఎస్ఏలు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో అత్యధికంగా తెలుగు పోస్టులకు 32 మంది, ఇంగ్లిష్‌కు 29 మంది దరఖాస్తు చేయగా, అత్యల్పంగా జువాలజీ, కెమిస్ట్రీకి 13 మందేసి చొప్పున దరఖాస్తు చేసుకున్నారు.

ఉపాధి వేతనదారుకు పాముకాటు

నరసన్నపేట: మండలంలోని నడగాంకు చెందిన ఉపాధి వేతనదారు తియ్యార సింహాద్రి శుక్రవారం ఉపాధి పనిచేస్తుండగా పాము కా టు వేసింది. గ్రామ సమీపంలోని చిన్న కర్ర బట్టిలో ఉపాధి పనిచేస్తుండగా చేతి వేళ్లు, మండపై పాము కరిచింది. వెంటనే అప్రమత్తమైన తోటి వేతనదారులు ఆయనను నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని, 24 గంటలు పరిశీలనలో ఉంచుతున్నట్లు తెలిపారు. సింహాద్రిని ఉపాది మండల ఇంజనీర్ అప్పలరాజు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.



వేతనదారు సింహాద్రిని పరామర్శిస్తున్న అప్పలరాజు

డ్రోన్ల వినియోగంపై అవగాహన



సదస్సును ప్రారంభిస్తున్న గజపతిరావు

పర్లాకిమిడి: డ్రోన్ల వినియోగంతో వ్యవసాయం లాభసాటిగా మారుతుందని వక్తలు పేర్కొన్నారు. ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్ల వినియోగం, హైబ్రిడ్ విత్తనాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హైబ్రిడ్ మొక్కజొన్న, ఆర్.ఎస్.ఆర్.(డయాబెటిక్) విత్తనాల వినియోగం ద్వారా మంచి లాభాలు పొందవచ్చన్నారు. అంతకుముందు ఈ సదస్సును ఆర్.ఎం.సి.ఎస్.అధ్యక్షుడు ఎస్.గజపతిరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సెంచూరియన్ వర్సిటీ గెస్ట్ అధ్యాపకులు, మాజీ సంచాలకులు (అగ్రికల్చర్) ఎం.చంద్రశేఖర్‌రావు, ఎంఎస్.స్వామినాథన్ అగ్రికల్చర్ స్కూల్ అధ్యాపకుడు జె.అనిల్‌కుమార్, ఓర్మాస్ హెడ్ డాక్టర్ ప్రియంవద, రాయఘడ సమితి జెడ్పీటీసీ పి.పీతాంబర్ నాయక్, జిల్లా రైతు సంఘం నాయకులు సూర్యనారాయణ పట్నాయక్, గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీర్రాజు, సెంచూరియన్ రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్ర్, శ్రీకాకుళం, పరిసర గ్రామాల నుంచి 200 మంది రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అరటి పంటకు తీవ్ర నష్టం

గార: జిల్లాలో రెండు రోజుల కిందట వీచిన భీకర గాలులకు అరటి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని రాష్ట్ర అగ్రిమిషన్ మెంబర్ గొండు రఘురామ్, ఉద్యానవన శాఖ ఏడీ పి.ప్రసాద్ అన్నారు. వారు శుక్రవారం ఉదయం మండలంలోని బూరవెల్లి, అంబళ్లవలస, శాలిహుండం తదితర ప్రాంతాల్లోని పాడైన అరటి తోటలను రైతులతో కలసి పరిశీలించారు. ఈ క్రాప్ చేయించుకున్న రైతులందరినీ గుర్తించాలని, నేరుగా పంట వద్దకు వెళ్లి వివరాలు సేకరించి నాలుగు రోజుల్లో నివేదికలు అందజేయాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు.

అదే సమయంలో పాసుపుస్తకం లేని రైతులు కూడా ఉండటం వల్ల వారి వివరాలను వేరే ఫార్మాట్‌లో పంపించాలని అగ్రిమిషన్ సభ్యుడు, ఎంపీపీ రఘురామ్ అన్నారు. ఏడీ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో 165 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా నిర్ధారణ జరిగిందన్నారు. గార మండలంలో ఒక్క అరటి పంట సుమారు 80 ఎకరాలు ఉందని, అదేవిధంగా టెక్కలి, జి.సిగడాం, నర సన్నపేట మండలాల్లో అరటి పంటతో పాటు బొప్పాయి, కర్బూజా పంట కూడా నష్టపోయిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అరవల అప్పారావు, మళ్ల నారాయణమూర్తి, అరవల రామారావు, చింతల గడ్డెయ్య తదితరులున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మందస: మండలంలోని బాలిగాం గ్రామానికి చెందిన సీపాన విజయ్‌కుమార్(35) అనే వ్యక్తి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. విజయకుమార్ మద్యానికి బానిసై నిత్యం కుటుంబంతో గొడవ పడుతుండేవాడు. వేకువజామున ఇంటిలోనే ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు చూసి హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం హరిపురం సీహెచ్‌సీలోనే జరిగింది. మృతునికి భార్య అంజలి, కుమారుడు హర్ష ఉన్నారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

గ్యాస్ సిలిండర్ పేలి రెండిళ్లు దగ్ధం



కాలిపోతున్న ఇళ్లు

రేగిడి: మండల పరిధిలోని పోరాం గ్రామంలో శుక్రవారం సాయంత్రం గ్యాస్ సిలిండర్ పేలి రెండిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన సింగరాతి దాలయ్య, సింగరాతి రాములుకు చెందిన ఇళ్లు కాలిబూడిదయ్యాయి. వారంతా ఉపాధిపనులకు వెళ్లిన తరువాత ఇంట్లో ఒక్కసారిగా పెద్దశబ్దం రావడంతో స్థానికులు ఏం జరుగుతుందోనని భయకంపితులయ్యారు. వెంటనే ఇంట్లో నుంచి మంటలు రావడాన్ని గమనించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. వంటసామగ్రి, ద్విచక్రవాహనం, తిండిగింజలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్ గేదెల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ బొక్కెల రాంబాబులు సంఘటనా స్థలానికి వెళ్లి తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, ఆర్ఐ రేవతి, వీఆర్వో ఏవీ సత్యనారాయణలకు సమాచారం అందించారు. దీంతో వారితో పాటు ఎస్సై ఇ.శ్రీనివాస్, సిబ్బంది వచ్చి పరిశీలించారు.

లైంగికదాడిపై కేసు నమోదు

పాలకొండ రూరల్: స్థానిక ఏరియా ఆస్పత్రిలో జరిగిన లైంగికదాడి ఘటనపై పోలీసులు కేసునమోదు చేశారు. ఈ కేసు గురించి పాలకొండ ఎస్సై బి.శివప్రసాద్ అందించిన వివరాలిలా ఉన్నాయి. తన సోదరుడు ఆరోగ్య సమస్యతో పాలకొండ ఏరియా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరగా సీతంపేట మండలానికి చెందిన యువతి(19) సహాయకురాలిగా వచ్చి ఉంది. అయితే ఇదే వార్డులో పట్టణానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స నిమిత్తం ఇన్‌పేషెంట్‌గా చేరాడు. ఆరోగికి సహాయకుడిగా గారమ్మకాలనికి చెందిన యువకుడు ఉన్నాడు. సహాయకుడిగా వచ్చిన యువకుడు తనపై గురువారం రాత్రి ఆస్పత్రిలోని మరుగుదొడ్డిలో లైంగికదాడికి పాల్పడినట్లు బాధితురాలు పోలీసులకు అందించిన ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్సై తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

వంగర: మండల పరిధి అరసాడ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన సాయికుమార్ గాయాలపాలయ్యాడు. శుక్రవారం గ్రామం నుంచి రాజాం వైపు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వస్తుండగా బైక్ అదుపు తప్పడంతో రోడ్డుపై పడిపోయాడు. వెంటనే స్థానికులు 108 సమాచారం అందించడంతో సిబ్బంది విశ్వనాథం, పవన్‌లు ప్రథమ చికిత్స అందించి రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఎంపీసీ స్ట్రీం ఇంజినీరింగ్ పరీక్షకు 5315 మంది హాజరు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీఈఏపీ సెట్‌లో భాగంగా శుక్రవారం ఎంపీసీ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని టెక్కలి ఐతం, చిలకపాలెం శ్రీశివానీ, ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలు కేంద్రాలు పరీక్ష నిర్వహించారు. ఈ నెల 15న ప్రారంభమైన పరీక్ష తొమ్మిది షిఫ్టులుగా శుక్రవారం వరకు కొనసాగింది. శుక్రవారం ఒక్క షిఫ్టు మాత్రమే నిర్వహించారు. జిల్లా నుంచి ఇంజినీరింగ్‌కు 5517 మంది దరఖాస్తు చేసుకోగా, 5318 మంది హాజరయ్యారు. 96.39 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. చివరి రోజు శ్రీ వెంకటేశ్వరలో 190 మందికి 185 మంది, చిలకపాలెం శ్రీ శివానీలో 190కి 185, టెక్కలి ఐతంలో 256కి 244 మంది విద్యార్థులు హాజరయ్యారు.

రైలు ఢీకొని యువకుడు మృతి

మందస: మండలంలోని పిడిమందస గ్రామానికి చెందిన అరసవెల్లి సంతోష్‌కుమార్(34) శుక్రవారం రైలు ఢీకొని మరణించాడు. వృత్తి రీత్యా కార్పెంటర్‌గా పని చేస్తున్న సంతోష్‌కుమార్.. పని చేయడానికి అల్లిమెరక వైపు వెళ్లడానికి మఖరజోల గ్రామం వద్ద పట్టాలు దాటుతుండగా.. పలాస నుంచి బరంపురం వెళ్తున్న యశ్వంత్‌పూర్ సూపర్‌ఫాస్ట్ ట్రైన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సంతోష్‌కుమార్ అక్కడికక్కడే మరణించాడు. సమాచారం తెలుసుకున్న పలాస రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుని భార్య పావనిప్రియ, కుమారుడు విజయ్, కుమార్తె ఉషశ్రీలు కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్పీ ఎస్ఐ షరీఫ్ తెలిపారు. మృతదేహాన్ని పలాస సీహెచ్‌సీకి తరలించారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకే శిక్షణ



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ భారతమ్మ

గార: విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు శిక్షణ ఉపయోగపడుతుందని డైట్ ప్రిన్సిపాల్ ఎం.భారతమ్మ అన్నారు. వమరవల్లి ప్రభుత్వ డైట్‌లో గత ఐదు రోజులుగా నిర్వహించిన డీఎస్సీ-98, 2008 ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఆమె మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో విద్యార్థులకు బోధించాలన్నారు. కార్యక్రమంలో కోర్సు కో ఆర్డినేటర్ అప్పన్న, రిసోర్సు పర్సన్లు ఎస్పీ అనితారాణి, పీవీఎస్ఎస్ మూర్తి, సూర్యనారాయణ, పాపాచారి పాల్గొన్నారు.







● గాలి దుమారం జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం రాకాసి గాలి దుమారం రేపింది. సాయంత్రం సమయంలో అకస్మాత్తుగా వీచిన ఈదురుగాలులు అందరినీ భయపెట్టాయి. కొన్ని చోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడగా.. మరికొన్ని చోట్ల చెట్లకు చెట్లు పడిపోతాయేమో అన్నంతగా ఊగిపోయాయి. జల్లులు మాత్రం ఉపశమనం కలిగించాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

గిరికి ప్రగతి దారి

నాడు
కొత్తూరు మండలం గూనభద్ర పంచాయతీ కంతమానుగుడ గిరిజన గ్రామానికి వెళ్లే రహదారి దుస్థితి ఇది. ఆ గ్రామం నుంచి రాకపోకలు సాగించాలంటే గిరిజనులు అష్టకష్టాలు పడేవారు. ఎవరికైనా రోగం వస్తే మరింత దయనీయంగా ఉండేది. రోగులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. →



నేడు
కొత్తూరు మండలం గూనభద్ర పంచాయతీ కంతమానుగుడ గిరిజన గ్రామానికి వెళ్లేందుకు కొత్తగా వేసిన సీసీ రోడ్డు ఇది. ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో రూ. 21లక్షలు వెచ్చించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేసిన రోడ్డు. ఇప్పుడు గిరిజన గ్రామానికి రహదారి కష్టాలు తీరాయి. నేరుగా వాహనాలు అక్కడికి వెళ్తున్న పరిస్థితి ఇప్పుడుంది. →





- జిల్లాలో గిరిసీమలకు పక్కా రహదారులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గిరిజన గ్రామాలకు మోక్షం
- జిల్లాలో రూ.56.35కోట్లతో సీసీ, బీటీ రోడ్లు
- 102 గ్రామాలకు ఉపయోగపడేలా 42 రోడ్లు వేసిన సర్కారు

నాడు
కొత్తూరు మండలం అబలాసింగి గిరిజన గ్రామానికి వెళ్లే రహదారి గతంలో ఇలా ఉండేది. అది కూడా కొంతవరకే. చాలా వరకు ఈ రకంగా కూడా రహదారి లేని పరిస్థితి. ఆ గ్రామానికి గిరిజనులు నరకయాతన అనుభవించారు.





నేడు
కొత్తూరు మండలం అబలాసింగి గిరిజన గ్రామానికి కొత్తగా వేసిన రోడ్డు ఇది. ఇప్పుడీ గ్రామానికి రహదారి కష్టాలు తీరాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో రహదారికి నిధులు మంజూరు చేశారు. నేరుగా వాహనాలు ఆ గ్రామానికి వెళ్లిపోతున్నాయి.

సాక్షి ప్రతినిధి,శ్రీకాకుళం : విమానాలపై మనిషి గుండె, కిడ్నీ, లివర్ తరలించి రోగులకు అమర్చుతున్నారు. ఒకేసారి పదుల సంఖ్యలో ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపించే మేధావులను ఎన్నో ఏళ్లుగా చూస్తున్నాం. కానీ, అమాయకులైన గిరిజనులు కష్టాలు తీర్చే నాథుడు మాత్రం కనిపించలేదు. చంద్రన్న రోడ్లు, ట్రైబల్ వెల్ఫేర్ ఫండ్ రోడ్లు అంటూ హడావుడి చేసిన చంద్రబాబు ప్రభుత్వం ఏం చేసిందో ఎవరికీ తెలియని పరిస్థితి. రహదారుల్లేక గిరిజనులు పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వైద్యంకోసమైతే అర్రులు చాసిన దుస్థితి ఉండేది. మందుబిళ్లలు అందే పరిస్థితి కూడా ఉండేది కాదు. ఇలాంటి సన్నివేశాలు గిరిజన గూడల్లో నిత్యకృత్యంగా మారిన పరిస్థితి ఉండేది. ఇప్పుడా గ్రామాలు కష్టాలు తీర్చే పనిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిమగ్నమైంది. గిరిజన గూడలకు రోడ్లు వేసే బాధ్యతను జగన్ ప్రభుత్వం తీసుకుంది.

వైఎస్సార్‌సీపీ వచ్చాక..
వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో 102 గిరిజన గ్రామాలకు ఉపయోగపడేలా 42 సీసీ రోడ్లు వేసేందుకు రూ.56.35కోట్లు మంజూరు చేసింది. ఇప్పుడా పనులు చాలావరకు పూర్తయ్యాయి. కొన్ని పనులు చివరి దశలో ఉన్నాయి. పాతపట్నం నియోజకవర్గంలో పాతపట్నం, మెళియాపుట్టి, ఎల్ఎన్‌పేట, హిరమండలంలో 27 గిరిజన గ్రామాలకు ఉపయోగపడే విధంగా రూ.20కోట్లతో 14 రోడ్లు మంజూరు చేశారు. వాటిలో 11 రోడ్లు పూర్తయ్యాయి. మరో మూడు ప్రగతి దశలో ఉన్నాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కంచిలి, సోంపేట మండలాల్లోని 28గ్రామాలకు ఉపయోగపడేలా రూ.16.60కోట్లతో 10రోడ్లు మంజూరు చేశారు. పలాస నియోజకవర్గంలో పలాస, మందస మండలాల్లోని 47గిరిజన గ్రామాలకు ఉపయోగపడేలా రూ.19.75కోట్లతో 18రోడ్లు మంజూరు చేశారు. ఇప్పటికే ఆ రోడ్లు పనులన్నీ పూర్తయ్యాయి. దీంతో ఇప్పుడా గిరిజన గ్రామాల కష్టాలు చాలా వరకు తీరాయి. వైద్యం, ఇతరత్రా సదుపాయాలు సకాలంలో అందుతున్నాయి.

సకాలంలో వైద్యం అందుతోంది..



వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే రెడ్డి శాంతి కృషి మేరకు మహసింగిగూడ నుంచి కంతమానుగూడ వరకు రోడ్డు బాగు చేయడంతో సకాలంలో గిరిజనులకు వైద్యం అందుతోంది. మట్టి రోడ్డు వల్ల వర్షాకాలం వాహనాలు వచ్చేవి కావు. దీంతో వైద్య సమస్యలుండేవి. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత గిరిజన గ్రామాలకు రోడ్లు బాగు చేయడంతో గిరిజనులకు మేలు జరుగుతోంది.
– సవర నరసయ్య, కంతమానుగూడ, కొత్తూరు మండలం

సారా వద్దన్నందుకు గిరిజనుడి ఆత్మహత్య



భామినిమృతుడు అరిక మోహనరావు(39)

భామిని: సారా తాగి ఆరోగ్యం పాడు చేసుకుని కుటుంబాన్ని అప్పుల పాలు చేయవద్దని భార్య మందలించడంతో మద్యం మత్తులో పురుగు మందు తాగి భర్త ఆత్మహత్య పాల్పడ్డాడు. ఈ సంఘటనపై బత్తిలి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భామిని మండలం బొడ్డగూడకు చెందిన గిరిజనుడు అరిక మోహనరావు(39)గురువారం రాత్రి ఇంట్లో పురుగు మందు తాగడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సీతంపేట సీహెచ్ఎన్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు బత్తిలి ఏఎస్సై తులసినాయుడు కేసు నమోదు చేసి శుక్రవారం మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

రాజాం సిటీ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం వేకువజామున మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై వీబీ రామకృష్ణారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి ఒమ్మి గ్రామానికి చెందిన చిత్తిరి కృష్ణ (29) ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 9న విధులు ముగించుకున్న అనంతరం స్వగ్రామం వెళ్తుండగా మార్గమధ్యంలో రోడ్డుపై ఉన్న స్టాపర్ బోర్డును బలంగా ద్విచక్ర వాహనంతో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు 108 సహాయంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. శ్రీకాకుళంలోని రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య నాగమణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



కృష్ణ మృతదేహం

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు..



చీపురుపల్లి రూరల్: రైలు ఢీకొని మృతి చెందిన యువకుడు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి రైల్వేస్టేషన్ వద్ద హంసఫర్ రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందినట్లు శ్రీకాకుళం జీఆర్పీ ఎస్సై చెల్లూరి శ్రీనువాసరావు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉండొచ్చన్నారు. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 7013273731 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పిడుగుపాటుతో వ్యక్తి..



పార్వతీపురం: పిడుగుపాటుకు మృతిచెందిన తాతబాబు

పార్వతీపురం: మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో పెదబొండపల్లి గ్రామానికి చెందిన వంగపండు తాతబాబు (45)పై పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పొలం పనులకు వెళ్లిన ఆయన గ్రామంలోని తామర చెరువు సమీపంలో నుయ్యివద్ద పిడుగుపడి మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

టీడీపీ గంజాయ్

- పట్టుబడిన ముఠాలో టీడీపీ నాయకుడి కొడుకు
- విక్రయాల గుట్టు ఛేదించిన మందస పోలీసులు
- రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన గంజాయి బ్యాచ్
- పలాస నియోజకవర్గంలో సంచలనమైన టీడీపీ నాయకుడు కుమారుడి బాగోతం



మందస పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఆంధ్రప్రదేశ్‌లో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలు జరుగుతున్నాయంటూ టీడీపీ ప్రధాన కార్యదర్శి, చంద్రబాబు పుత్రుడు నారా లోకేష్ ఇటీవల ఏకంగా ప్రధానికి ఫిర్యాదు చేశారు. పలు కథనాలను కూడా ఫిర్యాదుకు జత చేశారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. టీడీపీ నాయకులకే ఆ గంజాయితో లింకులు ఉండటంతో వరుసగా పట్టుబడుతున్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో పలుచోట్ల గంజాయితో టీడీపీ నాయకులు పట్టుబడ్డారు. తాజాగా మందస మండలంలోని అంబుగాంలో గంజాయి వ్యాపారం చేస్తున్న టీడీపీ నాయకుడు బాగోతం బయటపడింది. గంజాయిను పట్టుకుంటే టీడీపీ నాయకుడి గుట్టు రట్టయ్యింది. వాస్తవానికి గంజాయి సాగు, అక్రమ రవాణాపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యుద్ధం ప్రకటించింది. ఆపరేషన్ పరివర్తన్ పేరుతో రాష్ట్రాన్ని గంజాయి రహితంగా మార్చేందుకు నడుం బిగించింది. ఆ దిశగా యంత్రాంగం దాడులు, ఆకస్మిక తనిఖీలు చేస్తుంటే గంజాయి డెన్‌లో టీడీపీ నాయకుల ప్రమేయం వెలుగు చూస్తోంది. రహస్యంగా సాగుతున్న గంజాయి వ్యాపారం గుట్టును తాజాగా మందస పోలీసులు ఛేదించారు. పక్కా సమాచారం, ప్రణాళికతో మందస ఎస్ఐ ఎనుకోటి రవికుమార్ ఆధ్వర్యంలో దాడులు చేసి, నిందితులను పట్టుకున్నారు. ఈ ముఠాలో మందస మండలానికి చెందిన తెలుగు దేశం పార్టీ నాయకుడు కూడా ఉన్నాడు. మాజీ ఎమ్మెల్యే గౌతు శ్యామ సుందర్ శివాజీ అనుచరుడు, మందస మండలంలోని మఖరజోల గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ చైర్మన్ బమ్మిడి కర్రయ్య కుమారుడైన బమ్మిడి తేజ ఈ గంజాయి ముఠా సభ్యుడిగా పోలీసులు గుర్తించారు. వాస్తవంగా మందస మండలంలోని అంబుగాం గ్రామంలో ఎప్పటి నుంచో గంజాయి వ్యాపారం రహస్యంగా సాగుతోంది. పోలీసుల కన్ను గప్పి ఒడిశా, ఆంధ్రాలకు చెందిన కొంతమంది ముఠాగా ఏర్పడి గంజాయి వ్యాపారం చేస్తున్నట్టుగా సమాచారం ఉంది. దీనిపై పక్కా నిఘా పెట్టిన మందస ఎస్ఐ రవికుమార్ పథకం ప్రకారం దాడులు చేసి ముఠాను పట్టుకున్నారు. అంబుగాం గ్రామానికి చెందిన మజ్జి హరికృష్ణ ఒడిశా నుంచి గంజాయి తీసుకు వచ్చి.. ఈ ప్రాంతంలో విక్రయాలు చేస్తున్నాడు. టీడీపీ నాయకుడు బమ్మిడి తేజతో పాటు వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన బెహరా చింతామణి, మువ్వల చక్రి, పలాసకు చెందిన తంగుడు అవినాష్, కె.హేమంత్, ఒడిశాకు చెందిన సునీల్, ప్రకాశం జిల్లాకు చెందిన సందీప్‌లు ముఠాగా ఏర్పడి గంజాయి వ్యాపారం చేస్తున్నారు. కొంతకాలంగా సాగుతున్న ఈ వ్యాపారంపై మందస పోలీసులకు పక్కా సమాచారం అందడంతో దాడి చేశారు. దీంతో అంబుగాం శివాలయం వద్ద రెడ్ హ్యాండెడ్‌గా హరికృష్ణ, చింతామణి, చక్రి, అవినాష్, హేమంత్, తేజ, ఢిల్లేశ్వరరావులు దొరికిపోయారు. వీరి వద్ద నుంచి 24.7కిలోల గంజాయిను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రవికుమార్ చెప్పారు. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న ఒడిశాకు చెందిన విక్రం, ప్రకాశం జిల్లాకు చెందిన సునీల్ పరారయ్యారు. వీరిద్దర్నీ కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. నిందితులను శ్రీకాకుళంలోని ఎక్సైజ్ కోర్టుకు తరలించగా, 14 రోజుల పాటు రిమాండ్ విధించారని ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఎన్నడూలేని విధంగా గంజాయి వ్యాపారంలో పలువురు అరెస్ట్ కావడం, అందులో టీడీపీ నాయకుడు కొడుకు ఉండటం మందసలో సంచలనంగా మారింది.

ఆ కలయిక అ'పూర్వం'

● 30 ఏళ్ల తరువాత కలిసిన విద్యార్థులు



గురువులతో 30 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రాజాం సిటీ: వారంతా 30 ఏళ్ల క్రితం కలిసి వంగర మండలం కొప్పరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి (1989 నుంచి 1994) వరకు చదువుకున్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి శుక్రవారం రాజాంలోని ఓ హోటల్ వేదికైంది. 30 ఏళ్ల తరువాత కలుసుకున్న వారంతా ఒరేయ్ మహేష్ బాగున్నావా? వెంకటరమణ, లక్ష్మి, రమణమ్మ, శాంతి ఏం చేస్తున్నారు? ఎన్నాళ్లైందిరా నిన్ను చూసి అంటూ ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఆప్యాయంగా రోజంతా గడిపారు. ఆనాటి జ్ఞాపకాలను, చిలిపి చేష్టలను నెమరువేసుకున్నారు. స్నేహభావాలు పెంపొందించుకుంటూ తాము చదివిన పాఠశాల అభివృద్ధితోపాటు సమాజాభివృద్ధికి తమ వంతు కృషిచేయాలని నిర్ణయించుకున్నారు. పేద విద్యార్థుల ఉన్నత చదువుకు సైతం ప్రోత్సాహం అందించేందుకు ముందుకొచ్చారు. అంతకు ముందు విద్యాబుద్ధులు నేర్పి క్రమశిక్షణతో తీర్చిదిద్దిన గురువులు మాచర్ల హరినారాయణ, జి.సత్యంనాయుడు, మర్రాపు అప్పలస్వామి, గుంటముక్కల శ్రీరామమూర్తి, సత్తారు ఆనందరావులను విద్యార్థులంతా ఘనంగా సత్కరించారు.

ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయంలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 31లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటీడబ్ల్యూగురుకులం.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కురుపాం, కొటికిపెంట, అనసభద్ర ఏకలవ్య కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ,హెచ్ఈసీ గ్రూపులలో 30 సీట్లు చొప్పున ఉన్నాయన్నారు. మరన్ని వివరాలకు జీఎల్ పురం ప్రిన్సిపాల్ ఫోన్ 6303508032 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు మౌలిక సదుపాయాలు

● జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విజయనగరం ఫోర్ట్: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సిప్డా పథకం ద్వారా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో విభిన్న ప్రతిభావంతులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల వద్ద విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు.

అంధులు, దివ్యాంగులు నడవడానికి అనువైన ఫ్లోరింగ్, రెయిలింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లాలో 71 ప్రభుత్వ శాఖలతో పాటు, తహసీల్దార్, మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాలను పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్ఈ గుప్త, ఆర్ అండ్‌బీ ఈఈ రమణ తదితరులు పాల్గొన్నారు.

పది నిమిషాల్లో మ్యారేజీ సర్టిఫికెట్

మెళియాపుట్టి: మండలంలోని పెద్ద పద్మాపురం సచివాలయంలో గ్రామానికి చెందిన వెంకటరావు వివా హ ధ్రువీకరణ పత్రం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. సచివాలయంలో కేవలం పది నిమిషాల్లోనే ఆయనకు సర్టిఫికెట్‌ను అందజేశారు. దీంతో కార్యదర్శి అప్పారావు, డిజిటల్ అసిస్టెంట్ దిలీప్‌లను గ్రామంలో పలువురు అభినందించారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుచేసిన తర్వాత ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని కార్యదర్శి అప్పారావు తెలిపారు. ఆధార్ నవీకరణలో దిలీప్‌కు రాష్ట్రంలోనే మొదటిస్థానం లభించిన విషయాన్ని గుర్తుచేశారు.

పిడుగుపడి యువకుడు మృతి



పిడుగుపాటు గురై మృతి చెందిన ప్రశాంత్ దొళాయి

కంచిలి: మండలంలోని తలతంపర పంచాయతీ పరిధి లండపుట్టుగ గ్రామానికి చెందిన ప్రశాంత్ దొళాయి(20) శుక్రవారం పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. తోటి యువకులతో కలిసి గ్రామానికి దూరంగా ఉన్న చెరువు గ్రౌండ్‌లో ప్రశాంత్ క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. వర్షం పడడంతో అంతా ఇళ్లకు పరుగు పెట్టారు. అయితే ప్రశాంత్ ఎవరూ లేని ప్రదేశంలో ఉండగా అమాంతం అతనిపైనే పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ యువకుడు విజయనగరంలో బీఎస్సీ డిగ్రీ ప్రథమ సంవత్సరం చదివి వేసవి సెలవులకు స్వగ్రామానికి వచ్చాడు. ప్రశాంత్ తల్లిదండ్రులు ఖెత్రో దొలాయి, జొరా దొలాయిలకు ఇతను ఒక్కడే మగ సంతానం. ఇద్దరు కుమార్తెలకు వివాహాలయ్యారు. ప్రశాంత్ మృతితో తల్లిదండ్రులకు ఆధారం లేకుండాపోయింది. పైగా మృతుని తల్లి జొరా దొలాయి కిడ్నీ వ్యాధి బాధితురాలు. ప్రతి వారం సోంపేట వెళ్లి డయాలసిస్ చేయించుకుంటారు. ఇప్పుడు ఈ విషాద వార్త విని వారు తల్లడిల్లిపోయారు. స్థానిక సర్పంచ్ డాక్టర్ జగబంధు దొలాయి పర్యవేక్షణలో మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

జిల్లా అదనపు ఎస్పీగా తిప్పేస్వామి

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం జిల్లా పోలీస్ శాఖలో అడ్మిన్ విభాగానికి అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా జె.తిప్పేస్వామి నియమితులయ్యారు. పదోన్నతిపై ఆయన ఇక్కడకు వస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఈ మేరకు ఎస్పీ జీఆర్ రాధిక ఓ ప్రకటన విడుదల చేశారు. ఇదివరకు చిత్తూరు ట్రాఫిక్ డీఎస్పీగా తిప్పేస్వామి పనిచేశారు. శ్రీకాకుళం జిల్లా డీటీసీ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న గుంటుపల్లి శ్రీనివాసరావు పదోన్నతిపై విశాఖ ట్రాఫిక్ ఏడీసీపీగా పోస్టింగ్ కల్పించింది.